www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 24 సెప్టెంబరు 2024 5

పశ్చిమ గోదావరి

నేడు ఉచిత మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గుండె జబ్బులున్న చిన్నపిల్లల కోసం ఈనెల 24న మంగళవారం ఉచిత మెడికల్ క్యాంప్ మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసుధ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంపులో పిడియాట్రిక్ గుండె వైద్యనిపుణులు డాక్టర్ విక్రమ్ విజయవాడ పాల్గొని పిల్లలకు ఉచితంగా ఒపి, ఇసిజి, 2డి ఎకో పరీక్షలు నిర్వహించి, గుండె జబ్బులు గుర్తించిన చిన్నపిల్లలకు ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లుగా తెలిపారు. 50 మంది చిన్నపిల్లలు ఈ క్యాంపు ద్వారా ఆపరేషన్లు, వైద్యసేవలు తీసుకుని గుండె సమస్యలను మెరుగుపర్చుకున్నట్లు వసుధ ఫౌండేషన్ భీమవరం ఇన్‌ఛార్జి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. ఈ క్యాంపుని చుట్టుపక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

డబ్బులు కొట్టు.. జడ్జిమెంట్ పట్టు..!

కెఆర్‌పురం ఐటిడిఎలో గిరిజనులకు అన్యాయం

విచారణ లేకుండానే ఎల్‌టిఆర్ భూములపై జడ్జిమెంట్‌లా

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనుకుమార్‌పై తీవ్ర ఆరోపణలు

ఆయన వచ్చాక వందల సంఖ్యలో జడ్జిమెంట్‌లు అంటూ గిరిజనులు గగ్గోలు

డబ్బులు తీసుకుని గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన

సిబిసిఐడి విచారణ జరిపించాలంటూ గిరిజన, ప్రజాసంఘాలు డిమాండ్

'గిరిజనులకు అండగా ఉండాల్సిన ఐటిడిఎ అధికారులు, అక్కడి ప్రజాప్రతినిధులు అందుకు పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారా.. చట్టాలను తుంగలోతొక్కి గిరిజనుల భూములను గిరిజనేతరులకు కట్టబెడుతున్నారా.. ఎల్‌టిఆర్ భూముల కేసుల్లో ఇష్టానుసారంగా జడ్జిమెంట్లు ఇచ్చేస్తున్నారా.. గిరిజనేతర భూస్వాముల నుంచి పెద్దఎత్తున సొమ్ములు తీసుకుని అమాయక గిరిజనులకు అన్యాయం చేస్తున్నారా'.. అంటే అవుననే సమాధానం వస్తోంది. ఎల్‌టిఆర్ భూములపై కెఆర్‌పురం ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇస్తున్న తీర్పులు వివాదాస్పదంగా మారాయి. ఆయన హయాంలో ఇచ్చిన తీర్పులపై సిబిసిఐడి విచారణ జరిపించాలంటూ గిరిజన, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఐటిడిఎ కార్యాలయం

కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలో ఎల్‌టిఆర్ భూములపై జరుగుతున్న అవినీతి వ్యవహారంపై గిరిజనులు భగ్గుమంటున్నారు. డబ్బులు కొట్టు.. జడ్జిమెంట్ పట్టు అన్న చందగా ఐటిడిఎ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టు తయారైందని అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్ తమకు తీరని అన్యాయం చేస్తున్నారంటూ లబోదిబోమంటున్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో గిరిజనులకు చెందాల్సిన ఎల్‌టిఆర్ భూములను ఇష్టానుసారంగా గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని 1/70 యాక్ట్ ప్రకారం భూముల బదలాయింపులు ఇష్టానుసారం చేయడం కుదరదు. గిరిజనుల నుంచి గిరిజనులే భూముల కొనాలంటే పెద్ద ప్రక్రియ ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలోని భూములను గిరిజనేతరులు కొనుగోలు చేసేందుకు చట్టం అంగీకరించదు. అందుకు విరుద్ధంగా గిరిజనుల భూములను గిరిజనేతర భూస్వాములకు అధికారులు కట్టబెడుతున్న తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గిరిజనేతర భూస్వాములు చాలామంది ఏజెన్సీలో ఉన్న గిరిజన భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్నారు. ఈ భూములపై గిరిజనులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. తమ భూములు తమకు ఇప్పించాలంటూ ఐటిడిఎ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టులో అప్పీల్ చేసుకున్నారు. నిబంధనల ప్రకారం నోటీసులిచ్చి.. ఇరువురి సమక్షంలో పత్రాలు పరిశీలించి, విచారణ చేసిన తర్వాత జడ్జిమెంట్‌లు ఇవ్వాలి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా జి.శ్రీనుకుమార్ వచ్చినప్పటి నుంచి సరైన విచారణ చేయకుండానే ఏజెన్సీలోని ఎల్‌టిఆర్ (ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్) భూములకు సంబంధించిన తీర్పులు ఇచ్చేస్తున్నట్లు గిరిజనులు గగ్గోలు పెడుతున్నారు. జీలుగుమిల్లి మండలం రామన్నపాలెం గ్రామంలోని సర్వే నెంబర్ 2/4 సర్వే నెంబర్‌లో 5.82 ఎకరాల ఎల్‌టిఆర్ భూమికి సంబంధించి గిరిజనులైన పండు రామలక్ష్మి, పండు, నరేంద్రబాబు కెఆర్‌పురం ఐటిడిఎ పిఓ కోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. ఐటిడిఎ పిఒగా సూర్యతేజ్ ఉన్నప్పుడు విచారణ చేసి ప్రభుత్వ న్యాయవాది సలహా తీసుకుని గిరిజనులకు చెందేవిధంగా తీర్పు ఇవ్వడానికి సిద్ధమైన సమయంలో ఆయన బదిలీ అయిపోయారు. ప్రభుత్వం ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ భూమిని గిరిజనేతరులకు చెందేవిధంగా శ్రీనుకుమార్ తీర్పు ఇచ్చిన పరిస్థితి నెలకొంది. ఇలా గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇచ్చిన తీర్పులు అనేకం ఉన్నాయి. దాదాపు వందకు పైగా కేసుల్లో ఆయన జడ్జిమెంట్‌లు పాస్ చేసి వేలాది ఎకరాల భూములను గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఎస్‌డిసి జి.శ్రీనుకుమార్ హయాంలో ఇచ్చిన ఎల్‌టిఆర్ భూముల తీర్పులపై సమగ్ర విచారణ చేయాలని పెద్దఎత్తున డిమాండ్లు వినిపిస్తున్నాయి

జడ్జిమెంట్ ప్రాతిపదికన సొమ్ములు వసూలంటూ ఆరోపణలు

ఏజెన్సీ ప్రాంతంలోని భూములు గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టేందుకు పెద్దఎత్తున అవినీతి పర్వం నడిచినట్లు గిరిజనులు చెబుతున్నారు. గిరిజనేతర భూస్వాములకు తీర్పులు అనుకూలంగా ఇచ్చేందుకు ఎస్‌డిసి జి.శ్రీనుకుమార్ పెద్దఎత్తున సొమ్ములు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జడ్జిమెంట్‌లో ఉన్న భూములను బట్టి రూ.లక్షల్లో సొమ్ములు దండుకుంటున్నట్లు చెబుతున్నారు. ఆయన కాలంలో ఇచ్చిన తీర్పులతో రూ.కోట్లలో అవినీతి సొమ్ముల పోగుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధిత గిరిజనులు వందల సంఖ్యలో ఉన్నట్లు చెబుతున్నారు. గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఏజెన్సీలో గిరిజనులు రోడ్డెక్కుతున్న పరిస్థితి నెలకొంది.

ప్రజాప్రతినిధుల అండతోనే రెచ్చిపోతున్నారా?

ఏజెన్సీలో గిరిజన తరగతికి చెందిన ఎంఎల్‌ఎలే ఉన్నారు. గిరిజనులకు ఇంత నష్టం జరుగుతున్నా ఎంఎల్‌ఎలు స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధుల అండతోనే ఎస్‌డిసి అవినీతి వ్యవహారం నడిచిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గిరిజనులకు అన్యాయం జరుగుతుంటే ఆ ప్రాంతంలోని గిరిజన ప్రజాప్రతినిధులు మాట్లాడకపోవడం ఏంటన్న చర్చ నడుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకుంటే తప్ప గిరిజనులకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడంలేదు.

ఎస్‌డిసి శ్రీనుకుమార్ ఇచ్చిన జడ్జిమెంట్‌లపై విచారణ చేయాలి

తెల్లం రామకృష్ణ, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు

'ఎల్‌టిఆర్ భూములపై సమగ్ర విచారణ చేయాలి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్ కాలంలో ఇచ్చిన తీర్పులపై సిబి సిఐడి విచారణ జరిపించాలి. రికార్డ్ అసిస్టెంట్ భీమరాజుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. గిరిజనులకు అన్యాయం జరగకుండా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

విచారణ లేకుండా ఇచ్చిన జడ్జిమెంట్లను రద్దుచేయాలి

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

'ఐటిడిఎకు పూర్తిస్థాయి ఐఎఎస్ అధికారిని పిఒగా నియమించాలి. సరైన విచారణ జరపకుండా ఎల్‌టిఆర్ భూములపై ఇచ్చిన జడ్జిమెంట్లను రద్దుచేయాలి. కొత్త ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో సొమ్ములు తీసుకుని గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా తీర్పులు ఇచ్చేశారు. దీనిపై సిబిసిఐడితో సమగ్ర విచారణ జరిపించి గిరిజనులకు న్యాయం చేయాలి.'

లేబర్ కోడ్లు రద్దు చేయాలి

బ్లాక్ డేలో భాగంగా సిఐటియు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసనలు

భీమవరంలో నిరసన తెలియజేస్తున్న నేతలు

తాడేపల్లిగూడెంలో..

తణుకులో..

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి కొత్త సమస్యలను ప్రజలపై నెడుతోందని కార్మిక సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా భీమవరంలో బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఎఐటియుసి నాయకులు సిహెచ్ రంగారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుగుణంగా ఉండే విధానాలతో పాటు తన అధికారం ఓటు బ్యాంకును కాపాడుకోవడం కోసం లేనిపోని సమస్యలను ప్రజల మీద రుద్దుతోందన్నారు. నోట్ల రద్దు, జిఎస్‌టి వంటి వాటితో పాటు పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని దీనివల్ల కార్మికులకు, స్కీం వర్కర్లకు నష్టం జరుగుతుందని తెలిపారు. కార్మిక చట్టాల ద్వారా ఇప్పటివరకూ పొందిన సౌకర్యాలను లేబర్ కోడ్‌లు తీసివేస్తున్నాయన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం పొందే హక్కు, యూనియన్ పెట్టుకునే హక్కు, సమస్యలను చెప్పుకునే హక్కు, ఇటువంటి అవకాశాలను లేబర్ కోడ్లు మృగ్యం చేస్తున్నాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, శ్రామిక మహిళ నాయకురాలు డి.కళ్యాణి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ రైతాంగానికి గిట్టుబాటు ధర కోసం ఏ చట్టమూ లేదని, వ్యవసాయ కార్మికులకు ఉన్న చట్టాన్ని కూడా నిర్వీర్యం చేసే పద్ధతి కొనసాగుతుందని తెలిపారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విరమించాలని లేనిపక్షంలో మరోసారి ప్రజా ఉద్యమాలను చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అధ్యక్షత వహించగా బి.వాసుదేవరావు, ఇంజేటి శ్రీనివాస్, వరలక్ష్మి, గోపాలకృష్ణంరాజు, శేషపు అశ్రియ, మునియ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సిఐటియు భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను మార్పు చేసి యజమానులకు చుట్టాలుగా మార్చిందన్నారు. ప్రజలు అడుగుతున్న సమస్యలు కాకుండా తమ సొంత ఎజెండాను తీసుకొచ్చి ప్రజలపై రుద్దుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, పెద్ద కనకరాజు, రాంబాబు కలిశెట్టి శ్రీనివాసు, మధు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి, ఆ చట్టాలను కార్పొరేట్లకు అప్పజెప్పడం వల్ల కార్మిక వర్గం కట్టు బానిసలుగా మారతారని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పేర్కొన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు ఐ ల్యాండ్ వద్ద బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు అండగా ఉన్న ఉపాధి హామీ చట్టం కోత విధించడం వల్ల ఉపాధి కూలీలకు పనులు తగ్గాయన్నారు. కౌలుదారులకు గుర్తింపు కార్డులు లేని కారణంగా వ్యవసాయ రంగంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల వల్ల వ్యవసాయ రంగానికి దూరం అవుతున్నారన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోకపోతే బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు, జి.నాగేశ్వరరావు, మేట్రెడ్డి రమణ, పైలు చిన్నా, పోతు శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు పాల్గొన్నారు.

తణుకు : కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయకపోతే మోడీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. స్థానిక నరేంద్ర సెంటర్లో కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ప్రతాప్ మాట్లాడుతూ 2019 సెప్టెంబరు 23న పార్లమెంట్‌లో ఎలాంటి చర్చలు లేకుండా ఏక పక్షంగా కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక చట్టాలు తీసుకొచ్చిందని విమర్శించారు. ఏ ప్రభుత్వమైనా కార్మికుల రక్షణ, రైతుల రక్షణ కోరుకొంటాయని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మాత్రమే చట్టాలు మార్చారని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు, పి.దక్షిణామూర్తి, శివకుమార్, అంబటి రామకృష్ణ, సిహెచ్ రామకృష్ణ, త్రిమూర్తులు, కె.గోవింద్, సురేష్, రత్నబాబు, దుర్గప్రసాద్, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉండి : కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ధనికొండ శ్రీనివాస్, కొట్టాడ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఉండి పెద్ద వంతెన సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న నలబై నాలుగు రకాల కార్మిక చట్టాలు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు చేసి 50 కోట్ల మంది కార్మికుల హక్కులను కాలరాసిందని విమర్శించారు. కార్యక్రమంలో రామకూరి వెంకట రత్నం, చిప్పాడ బుచ్చేశ్వరరావు, కురిటి సోమేశ్వరరావు, చీరల శ్రీనివాస్, కింతాడ రమేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగరాణితో పాటు జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, జిల్లా అధికారులు జిల్లాలో అర్జీదారుల నుంచి 277 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించిన సమయంలో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పిజిఆర్‌ఎస్ (మీ కోసం) నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అర్జీల పరిష్కారానికి మార్గదర్శకాలను తప్పక పాటించాలని తెలిపారు. ప్రతి అర్జీనీ సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. పరిష్కారంలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకసారి వచ్చిన ఫిర్యాదు మరలా రాకుండా అధికారులు అత్యంత బాధ్యతతో పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు చెప్పేందుకు వెళ్తే అడ్డుకుంటారా

ఎస్‌ఎఫ్ఐ నేతల విమర్శ

ప్రజాశక్తి - భీమవరం

వినతిపత్రాన్ని చూపుతున్న ఎస్‌ఎఫ్ఐ నేతలు

విద్యారంగ సమస్యలు కలెక్టర్‌కు చెప్పుకునేందుకు వెళితే పోలీసులు అడ్డుకోవడం దారుణమని ఎస్‌ఎఫ్ఐ విమర్శించింది. ఎక్కడో కులపరమైన గొడవ జరిగితే కలెక్టరేట్‌కు వెళ్లనీయకుండా సామాన్య ప్రజానీకాన్ని సైతం అడ్డుకొని ముప్పు తిప్పలు పెట్టడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించింది. ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కాళ్ల మండలం ఏలూరుపాడు ఫ్లెక్సీ వివాదంలో భాగంగా ఆందోళన జరుగుతుందని భావించిన పోలీసులు కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో భారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌కు విద్యారంగ సమస్యలు విన్నవించేందుకు వెళ్లిన ఎస్‌ఎఫ్ఐ నేతలతో పాటు సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన సామాన్య ప్రజలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు ఎస్‌ఎఫ్ఐ నేతలు సమస్యలను విన్నవించి కలెక్టరేట్‌కు అనుమతించాలని కోరినప్పటికీ పోలీసులు నిరాకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారుగా వంద రోజులు పూర్తయ్యిందన్నారు. ఏ సమస్య అయినా వంద రోజుల్లో పరిష్కరిస్తామని అని చెప్పే ముఖ్యమంత్రి ఇప్పటికీ విద్యారంగంలో సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి బి.గణేష్ మాట్లాడుతూ జిఒ 77ను వెంటనే రద్దు చేయాలన్నారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన రూ.3 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సిహెచ్ శాంతి, డి.సిద్ధు, సింధు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఎంఎల్‌ఎ తీరుకు నిరసనగా చలో భీమవరంకు పిలుపు

దళిత సంఘాల నేతల ముందస్తు అరెస్టు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల : కోనా జోసఫ్‌ను పోలీసుల హౌస్ అరెస్ట్

ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీ తొలగించిన ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం దళిత సంఘాల నాయకులు ఏలూరుపాడు నుంచి మోటార్ సైకిల్ ర్యాలీతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా ఏలూరుపాడులో ఎపి బహుజన జెఎసి అధ్యక్షులు కోనా జోసఫ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. చలో భీమవరంకు పిలుపునివ్వడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ముందస్తు చర్యగా అదనపు బలగాలను మోహరించారు. చలో భీమవరంలో కలెక్టర్, జిల్లా ఎస్‌పి, డిఎస్‌పికి మెమోరాండం ఇవ్వడానికి బయలుదేరిన కోనా జోషఫ్‌ని ఏలూరుపాడులో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. వారిని కలెక్టర్ దగ్గరికి తీసుకెళ్లే విషయంలో భాగంగా సీనియర్ అడ్వకేట్ బడుగు అశోక్‌బాబు ఏలూరుపాడు గ్రామం వచ్చి పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు.

ఏలూరుపాడులో పోలీస్ పికెట్

ఏలూరుపాడు గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న వినాయక గుడి వద్దకు పలు గ్రామాల నుంచి టిడిపి, జనసేన నాయకులు, విశ్వ హిందూ పరిషత్ నాయకులు వచ్చి సోమవారం ధర్నా నిర్వహించాలని ప్రయత్నించారు. వినాయకుడి గుడి వద్ద నాగేంద్ర విగ్రహం వద్దకు వెళ్లి పరిశీలించారు. జనం గుమిగూడకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. పోలీసుల జోక్యంతో ఆ ప్రాంతానికి వచ్చిన వారిని ధర్నా చేయకుండా పంపించేశారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

ఆచంట : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీలు చించివేసిన ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణ రాజుపై తక్షణమే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజు డిమాండ్ చేశారు. ఉండి నియోజకవర్గం ఏలూరుపాడు గ్రామంలో ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు అంబేద్కర్ ఫ్లెక్సీని చించివేయటం అందరూ చూస్తుండగానే జరిగిందని, దీనిపై ఎంఎల్‌ఎపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పిలుపునిస్తే తప్పుచేసిన వారిని వదిలేసి నాయకుల్ని, కార్యకర్తలను అరెస్టు చేయటం దళిత జాతిని ఆగౌరపరచడమేనని నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం ఆయన భీమవరం బయలుదేరి వెళుతున్న నేపథ్యంలో పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద పోలీసులు ఆయనను అడ్డగించి, ఆచంట వేమవరం మాల మహానాడు కార్యాలయం తీసుకొచ్చి హౌస్ అరెస్ట్ చేశారు. పుష్పరాజ్ మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఎంఎల్‌ఎగా చలామణి అవుతున్న రఘురామకృష్ణరాజు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఫ్లెక్సీని చింపివేయటం దారుణమన్నారు. ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు అయ్యేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తణుకు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని దుర్మార్గంగా చించివేసి రాజ్యాంగాన్ని అవమానపరచిన ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా దళిత్ రైట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బట్టు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం రాఘురామకృష్ణరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అత్తిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం తహశీల్దార్ డి.సుబ్రహ్మణ్యంకి వినతిపత్రాన్ని అందజేశారు. దళిత నాయకులు కొండే శ్రీను, రాపాక నాని, బుడితి సుజన్‌కుమార్, కొల్లాపు ఏసు పాల్గొన్నారు.

నరసాపురం : అంబేద్కర్ ఫ్లెక్సీ చించిన ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. ఈమేరకు సోమవారం వారు ఏలూరుపాడు నుంచి మోటార్ సైకిల్ ర్యాలీతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా నరసాపురంలో మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు కాకిలేటి ఆనంద్, సోడదాసి శ్రీధర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

సీతారాం ఏచూరి, ఆర్‌ఎస్ చిరస్మరణీయులు

సంస్మరణ సభలో నేతల నివాళి

ప్రజాశక్తి - భీమవరం

ఏచూరి, ఆర్‌ఎస్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు

సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణరాజు(ఆర్‌ఎస్) ఎప్పటికీ చిరస్మరణీయులుగా ఉంటారని సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు అన్నారు. సోమవారం జువ్వలపాలెం రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో సీతారాం ఏచూరి, ఆర్‌ఎస్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలు, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడంతోపాటు కేంద్రంలో ఎన్‌డిఎ కూటమి ఓటమి అంచున చేరడానికి సీతారాం ఏచూరి చేసిన విలువైన ఉపన్యాసాలు, విధానాలు కారణమని అన్నారు.

జిల్లాలో సిపిఎం నిర్మాతల్లో ఒకరైన ఆర్‌ఎస్ కార్మికవర్గానికి, ఇతర పేద, దళిత, గిరిజన ప్రజలకు గొప్ప అండదండలను అందించారని అన్నారు. వీరిరువురూ ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలిశెట్టి శ్రీనివాసు, మధు, పెద్ద కనకరాజు, రాంబాబు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి లేకపోవడం కమ్యూనిస్టులకు, లౌకిక ప్రజాస్వామ్యవాదులకు, ప్రజానీకానికి తీరని లోటని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం భీమవరం మండలం రూరల్ దెయ్యాలతిప్ప గ్రామంలో సీతారం ఏచూరి, ఆర్‌ఎస్‌కి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ సీతారం ఏచూరి విద్యార్థి దశలోనే ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ జైలుకెళ్లారన్నారు. జెఎన్‌యు యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ పదవికి ఇందిరాగాంధీకి అర్హత లేదు, రాజీనామా చేయాలని ఆందోళన చేశారన్నారు. పార్లమెంట్లో రాజ్యసభ సభ్యుడిగా రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై గలమెత్తే వారన్నారు. లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేయటానికి కీలకపాత్ర పోషించారన్నారు. ఉన్నతమైన కుటుంబంలో పుట్టి ఈ దేశ సమాజంకు తన జీవితాంతం పోరాటం చేశారన్నారు. ఆయన లేకపోవడం కమ్యూనిస్టులకు, లౌకిక ప్రజాస్వామ్యవాదులకు, ప్రజలకు తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో వాటాల పెద్దిరాజు, బొమ్మిడి నాగరాజు, పొన్నాబత్తుల గోపాలకృష్ణ, బొమ్మిడి ధర్మారావు, బత్తుల ప్రభుదాసు, తిరుమాణి నరసింహస్వామి పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి వ్యక్తి మానవ హక్కులను తెలుసుకోవడం చాలా ముఖ్యమని, వాటిని కాపాడటానికి యువత ప్రత్యేక కృషిచేయాలని జాతీయ మానవ హక్కుల చైర్‌పర్సన్ విజయభారతి సయాని తెలిపారు. శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్‌లో సోమవారం జరిగిన మానవ హక్కులపై అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ హక్కుల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణలో విద్యాసంస్థల పాత్ర, యువత బాధ్యతల గురించి తెలిపారు. ఈ అవగాహనా కార్యక్రమం ద్వారా విద్యార్థులు మానవ హక్కుల గురించే కాకుండా, సమాజంపై అవగాహన పెంచేందుకు ఎలా కృషిచేయాలో కూడా తెలుసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మహమ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ ప్రెసిడెంట్ బోగిరెడ్డి ఆదిలక్ష్మి, శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చిన్న వయసు నుంచి ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకున్నట్లయితే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ టి.లక్ష్మీకాంతం అన్నారు. సోమవారం స్థానిక రాయలంలో సచివాలయం రెండు పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. వారికి పండ్లు, చీరలు, స్వీట్లు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఒ మాట్లాడుతూ ముఖ్యంగా గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, దీంతో ఆరోగ్యకరమైన శిశువు జన్మిస్తారని, పుట్టిన శిశువు అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లల ఎదుగుదల విన్యాసానికి నుంచే పిల్లలకు పాలు, గుడ్డు, పప్పుదినుసులు, ఆకుకూరలు వంటి బలమైన ఆహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి.అనిల్ కుమారి, టీచర్లు సిహెచ్.మహాలక్ష్మి, ఇ.మణమ్మ, జి.దమయంతి, ఎఎన్ఎం ప్రియదర్శిని, ఆయాలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

30న కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - ఆచంట

చేనేత కార్మికులు ఇంటిల్లిపాది రెక్కలు ముక్కలు చేసుకుని నేత నేసినా.. వారికి కనీస కూలీ దక్కడం లేదని జాతీయ చేనేతవృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కర్ రావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలనే లక్ష్యంతో జాతీయ చేనేతవృత్తుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. చేనేత నేతన్న కోసం ప్రభుత్వాలు ఎన్ని పథకాలు రూపొందిస్తున్నా ఆచరణలో మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయని చెప్పారు. చేనేత కార్మికులకు కూలీలు పెంచాలని, అలాగే నేతన్న నేస్తం రూ.24 వేలు బ్యాంక్ అకౌంట్‌లో వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. పట్టు రాయితీ చేనేత సొసైటీలకు ఎలక్షన్ వెంటనే జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రతి నియోజకవర్గంలో నేత బజారు ఏర్పాటు చేయాలని కోరారు.

వికసిత్ భారత్‌తో లింక్ రోడ్లు

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత్ భారత్‌లో భాగంగా గ్రామాల మధ్య ఉన్న లింక్ రోడ్లను అభివృద్ధి చేయనున్నట్టు ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని తెలిపారు. ఇందుకు అవసరమైన విధివిధానాలను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జ్యోతి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాస్ తెలిపారు. ఐదు వందల మీటర్ల పొడవు, ఐదున్నర ఐదు అడుగులు ఉన్న మట్టి, బిటి రోడ్లకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అక్టోబర్ 2 నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉందన్నారు. అర్హత ఉన్న రోడ్లను వచ్చే సంవత్సరంలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. సోమవారంతో మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల మధ్య ఉన్న రోడ్ల సమాచారాన్ని సమావేశంలో ఎఇ శ్రీనివాస్‌కు తెలిపారు. త్వరలోనే వాటిని క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పరిశీలించి అంచనాలు రూపొందించడం జరుగుతుందని ఎఇ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, సర్పంచులు గెడ్డం భారతి, వేంద్ర వెంకటలీలా, వెంకటలక్ష్మి, యర్రంశెట్టి నాగసాయి, శీలబోయిన పద్మకుమారి, బోనం పరమేశ్వరరావు, ఎంపిటిసి అంగర కుటుంబరావు, గోలి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా ఏసుబాబు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా ఏసుబాబు నియమితులయ్యారు. ఆయన కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తాడేపల్లిగూడెం కమిషనర్‌గా బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.మురళీకృష్ణ విశాఖపట్నం కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు.

ఎంపిడిఒ బదిలీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు ఎంపిడిఒ ఉండ్రు బాబ్జి రాజు బదిలీ అయ్యారు. ఆయన ఎన్నికల ముందు తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాబ్జిరాజును తిరిగి తూర్పుగోదావరి జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

కుట్టు మిషన్ల మెకానిక్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - తణుకు రూరల్

కుట్టుమిషన్లు రిపేర్లలో ఉమ్మడిగోదావరి జిల్లాల్లో పేరుగాంచిన సీనియర్ మెకానిక్ గుత్తికొండ వెంకట్రావు మృతి టైలర్లకు తీరని లోటని వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం గౌరవాధ్యక్షులు బళ్ల చినవీరభద్ర రావు కొనియాడారు. స్థానిక వేల్పూరు గ్రామంలో గుత్తికొండ వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మల్లేశ్వరపు నాగరాజు, వాసా వెంకటేశ్వరరావు, తాడిశెట్టి కోట వెంకటేశ్వరరావు, కుడకా వీరభద్రరావు సంతాపం తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఏరియా ఆసుపత్రిలో సోమవారం పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొని హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిస్థితులను, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పలు విభాగాలను ఎంఎల్ఎ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, డాక్టర్ గణేష్, డాక్టర్ జాన్ హరీసన్, డాక్టర్ రామకృష్ణ, గంటాకృష్ణ పాల్గొన్నారు.

ఆకివీడు : స్వచ్ఛతా హి కార్యక్రమంలో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నియోజకవర్గంలో కార్మికులందరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన స్థాయిలో వైద్యం అందిస్తామని ఈ సందర్భంగా కూటమి నాయకులు తెలిపారు.

'ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుపై వైసిపి కుట్ర'

పాలకోడేరు : ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజుపై వైసిపి ఎస్‌సి, ఎస్‌టి సెల్ కుట్రపూర్వకంగా వ్యవహరిస్తుందని గొల్లలకోడేరు టిడిపి గ్రామ అధ్యక్షులు కమ్మిలి రాంబాబు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద టిడిపి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుని కావాలని అల్లరి చేస్తున్నారన్నారు. ఇది వైసిపి కుట్రగా అభివందించారు. ఉండి నియోజకవర్గం బిసి నాయకులు కామన రాంబాబు, జిల్లా ఎస్‌టి సెల్ నాయకులు సాలా మల్లేశ్వర రావు, కొండపల్లి యేసు రత్నం, జుత్తిగ శ్రీనివాస్, టి.శ్రీనివాస్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల మోటార్ సైకిల్ దొంగ అరెస్టు

ప్రజాశక్తి - గణపవరం

అంతర్ జిల్లాల మోటార్ సైకిల్ దొంగను సోమవారం అరెస్టు చేసినట్లు గణపవరం ఎస్ఐ ఎ.మణికుమార్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం మండలంలో ముగ్గుళ్ల గ్రామానికి చెందిన శెట్టి చిన్నా దురలవాట్లుకు లోనై ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. సోమవారం అతనిని అరెస్టు చేసి, దొంగిలించిన 29 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాటి విలువ రూ.22 లక్షలు ఉంటుందని తెలిపారు. డిఎస్‌పిడి శ్రావణ కుమార్, నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్, గణపవరం ఎస్ఐ ఆకుల మణికుమార్ పాల్గొన్నారు

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

లక్షల్లో ఫీజులు.. షెడ్డుల్లో చదువులు

శశి ఇంజినీరింగ్ కాలేజీలో పాముల స్వైరవిహారం
పాముకాటుకు గురైన విద్యార్థిని : పట్టించుకోని యాజమాన్యం
న్యాయం చేయాలని విద్యార్థిని తండ్రి డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లక్షల్లో ఫీజులు కట్టించుకుంటూ విషపు పురుగులు, పాములు తిరుగుతున్న షెడ్డులో చదువులు చెబుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు తాడేపల్లిగూడెం శశి విద్యాసంస్థలు. వివరాల్లోకెళితే ఉంగుటూరు మండలం నీలాద్రిపురం గ్రామానికి చెందిన చెమటపల్లి వర్షిత శశి కాలేజీలో ఇంటర్మీడియట్ ఎంపిసి చదువుతుంది. ఈనెల 19వ తేదీ(గురువారం) కాలేజీలో క్లాస్ రూమ్‌లో ఉండగా ఉదయం 10 గంటలకు షెడ్డు పై కప్పు నుంచి ఒక పాము తన తొడ మీద పడి కరిచినట్లు సిబ్బందికి, యాజమాన్యానికి తెలపగా వారు నిర్లక్ష్యం చేశారు. మధ్యాహ్నం మూడు గంటల వరకూ కాలయాపన చేసి చివరకు పరిస్థితి విషమించడంతో తనకు ఫోన్ చేసినట్లు విద్యార్థిని తండ్రి ఆనంద్ తెలిపారు. అనంతరం తల్లిదండ్రులు లబోదిబోమంటూ గవర్నమెంట్ హాస్పటల్‌కి తీసుకెళ్లగా ఆసుపత్రి వైద్యులు అది విషపు పామని దానికి విరుగుడు యాంటీ స్నేక్ వీనం(ఎఎస్‌వి) వేసి చికిత్స మొదలుపెట్టారని తెలిపారు. తర్వాత పరీక్షలు చేయగా బ్లడ్‌లో విషపు శాతం బాగా ఉందని ఒక్క డోస్‌తో పోయేది మూడు డోసులు వరకూ విరుగుడు ఇంజక్షన్ ఇవ్వవలసి వచ్చిందని, ఇంకా పాప పూర్తిగా కోలుకోలేదని విద్యార్థిని తండ్రి తెలిపారు. ఈ విషయమై విద్యార్థి తండ్రి, కొంతమంది పెద్దలు కలిసి సోమవారం ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ బూరుగుపల్లి గోపాలకృష్ణను కలిసి అడుగగా మీకు సమాధానం చెప్పాల్సిన పనిలేదు, మీకు చేతనైంది చేసుకోండి, మేము ఇలాగే చేస్తాం పిల్లచచ్చిపోలేదు కదా అంటూ మాపై దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సదరు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతామని బాధిత తండ్రి తెలిపారు. మా బిడ్డకు జరిగిన అన్యాయం భవిష్యత్తులో ఏ బిడ్డకి జరగకుండా యజమాన్యంపై తగు చర్యలు తీసుకొని పటిష్టంగా నిర్మాణం చేసిన రూముల్లో చదువులు చెప్పాలని వారు కోరారు. వీరికి సంఘీభావంగా సిపిఎం మండల నాయకులు కండెల్లి సోమరాజు, కె.శేఖర్, చదలవాడ కాంతారావు, తాడేపల్లి వెంకట్రావు, పెనుమాక మధు, పొట్ల నాగేష్ మద్దతు తెలిపి ఇటువంటి ఘటనలు పునారావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యాజమాన్య నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తూ నినదించారు. అనంతరం జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ విజయభారతి సయానిని కలిసి వినతిని అందజేశారు.

కళాశాల ముందు నినదిస్తున్న విద్యార్థి కుటుంబ సభ్యులు, సిపిఎం నాయకులు

వరద బాధితులకు విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

చూడ్డానికి వాళ్లంతా చిన్నపిల్లలే కానీ ఆ చిన్నారుల మనసు మాత్రం పెద్దదనడంలో సందేహం లేదు. అధిక వర్షాలు, వరదల కారణంగా ఇటీవల విజయవాడ ప్రాంతం అల్లకల్లోలం అయిపోయిన విషయం విధితమే. ఆ విషయాన్ని వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా గ్రహించిన చిన్నారులు సైతం సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. వివరాల్లోకి వెళితే పాలకొల్లు మండలం ఆగర్రు పంచాయతీకి చెందిన చిట్టియ్య వాని గరువు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రూ.4,625లు సేకరించారు. వీరిలో నాలుగవ తరగతి చదువుతున్న ఎల్లమెల్లి గిద్యోను అనే విద్యార్థి తాను దాచుకున్న కిడ్డి బ్యాంకులోని రూ.2,300 సైతం ఇచ్చి పెద్ద మనసు చాటుకుంది. ఇదేవిధంగా మండలంలోని పొలమూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రూ.3,333 సేకరించారు. ఈ మొత్తాన్ని సోమవారం మండల విద్యాశాఖ అధికారులు జి.వీరాస్వామి, ఆర్ఎన్ఎస్‌వి జి.గంగాధర శర్మకి, ప్రధానోపాధ్యాయులు పాక వెంకన్నబాబు, జి.ప్రకాష్ రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ఈ చిరు సహాయాన్ని వారంతా అభినందించారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే తోటి వారిని ఆదుకునే స్వభావం అలవర్చుకోవడం మంచి పరిణామం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, సిఆర్‌పిలు వినయ్ లత, సత్యనారాయణ, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

వీరవాసరం : వరద బాధితుల సహాయార్థం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు సేకరించిన విరాళాలను జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి ఆధ్వర్యంలో కలెక్టర్ నాగరాణికి సోమవారం అందజేశారు. మండలం నుంచి రూ.3,04,160ను కలెక్టర్‌కు అందజేసినట్టు ఎంఇఒ శ్రీమన్నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లంకలకోడేరు హై స్కూల్‌లో బేటి బచావో బేటి పడావో, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థినులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహనా కార్యక్రమం హైస్కూల్ హెడ్ మాస్టర్ పి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పులకడం సత్యవేణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. అలాగే సెల్‌కు దూరంగా ఉంటూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి కె.రాజేష్ కుమార్, ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ జి.జనార్ధన్ రావు, బి.జయశ్రీ, మహిళా పోలీసులు జి.లావణ్య, కె.ప్రసన్న పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఆడపిల్లలు అందరూ సురక్షితంగా చదవాలి, ఎదగాలని వైద్య, ఆరోగ్య శాఖ హెల్త్ ఎడ్యుకేటర్ పిబి.రామారావు అన్నారు. సోమవారం మండలంలోని వెలగలేరు(మార్టేరు) విద్యార్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పిసి, పిఎన్, ఒటి, యాక్ట్‌పై అవగాహన, ఆరోగ్యం, విద్యాబోధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేటీ బచావో బేటీ పడావో ఉద్దేశ్యం గురించి, కిశోర బాలబాలికల ఆరోగ్యం పరిరక్షణ, ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరించారు. బాలికల్లో రక్తహీనత వల్ల కలిగే నష్టాలు, పౌష్టికాహార ఆవశ్యకత పై ఆరోగ్య విద్యాబోధన చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రతినిధులు ఉమాదేవి, పి.సంధ్య పాల్గొన్నారు.

52 ఫిర్యాదుల స్వీకరణ

ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

నరసాపురం : ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్ అధికారులను ఆదేశించారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 52 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఆర్‌డిఒ వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు

నేడు, రేపు క్రీడాపోటీలు

నరసాపురం : మండలంలోని ఎల్‌బిచర్ల జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను ఈ నెల 24, 25వ తేదీల్లో నిర్వహించనున్నామని పాఠశాల క్రీడా సమాఖ్య సమన్వయకర్త అడపా రామకృష్ణ తెలిపారు. మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో 24న బాలికలకు, 25న బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం, యోగా, షటిల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

తోకతిప్ప శాఖా కార్యదర్శిగా బొడ్డు లక్ష్మీపతి

భీమవరం టౌన్ : సిపిఎం తోకతిప్ప శాఖ కార్యదర్శిగా బొడ్డు లక్ష్మీపతిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని సిపిఎం మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం రూరల్ తోకతిప్ప గ్రామంలో సోమవారం శాఖ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఎన్నికైన బుడ్డు లక్ష్మీపతి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంతో సిపిఎం పిలుపుమేరకు ప్రజా సమస్యలపై, రైతు కార్మిక సమస్యలపై పనిచేస్తానన్నారు. తిరుమాణి నాగేశ్వరావు, పొన్నమండ నాగేశ్వరావు, బొడ్డు ఏసు, తిరుమాణి సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర ఎ 2047 దార్శనికపత్రం రూపకల్పన

భీమవరం : జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్ లో జిల్లా స్థాయి ప్రణాళిక ప్రస్ఫుటంగా ఉండేలా ప్రజలు, ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర ఎ 2047 సమాచార వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్య సాధన కోసం ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎం.మోహన్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మిలటరీ కాలనీ రోడ్డు శంకుస్థాపన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అభివృద్ధి పనుల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గం ముందుంటుందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానికుల సహకారంతో ఒకటో వార్డు మిలట్రీ కాలనీ నుంచి స్థానిక ఎన్ఐటికి బైపాస్ రోడ్డుకు, కొండలమ్మ గుడి మెయిన్ రోడ్డుకు వెళ్లేలాగా అప్రోచ్ రోడ్డుకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గం దిక్సూచిగా మారిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ రోడ్డు వైడెనింగ్‌లో భాగంగా అక్కడ నివసిస్తున్న స్థానికుని ఇల్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొంత భాగం తొలగించాల్సి ఉంటుందని, అందుచేత మరమత్తు పనుల కోసం వెంటనే తక్షణ సాయం కింద ఎంఎల్ఎ శ్రీనివాస్ తన సొంత నిధులు రూ.20 వేలు బాధితుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మురళీకృష్ణ, వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, కాళ్ల గోపికృష్ణ, గుండుమోగుల సురేష్, పైబోయిన వెంకటరామయ్య, మాద్దాల మణికుమార్, అడబాల మురళీ, బయనపాలేపు ముఖేష్, దాగరపు నాగు, ప్రభుత్వాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహా ఐడిల్ 3 విన్నర్ నజీరుద్దీన్‌ను సత్కరించిన ఎంఎల్ఎ బొలిశెట్టి

ఆహా ఛానల్‌లో ఇండియన్ ఐడిల్ ఫేస్ త్రీ పాటల పోటీల్లో విన్నర్‌గా నిలిచిన తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన నజీరుద్దీన్‌ను తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, లోటస్ స్కూల్ చైర్మన్ బొలిశెట్టి రాజేష్ సత్కరించారు. మంచి పాటలతో అందరినీ అలరింపజేసి అత్యధిక ఓట్లతో గెలుపొందిన నజీరుద్దీన్‌ను ఎంఎల్ఎ అభినందించారు. ఈ సందర్భంగా నజీరుద్దీన్‌ను ఎంఎల్ఎ సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

'అత్యాచారాలను నిరోధించాలి'

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం నిట్ కళాశాల సెమినార్ హాల్‌లో స్పందన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రత అనే అంశంపై నిర్వహించిన చర్చ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి సాయిని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ చర్చ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రత అంశాలపై నిష్ణాతులైన మేధావులతో చర్చించి వారి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి సాయిని మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు, పని ప్రదేశాలలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి అఘాయిత్యాలు జరగకుండా పని ప్రదేశాలు, పరిశ్రమలు, పాఠశాలలు, వసతి గృహాల్లో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉందన్నారు. అఘాయిత్యాల కేసులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని, సత్వర చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుందన్నారు. ప్రతి సంస్థలోనూ మహిళల భద్రతకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కళాశాలలో, సంస్థలలో కౌన్సిలింగ్ ఇచ్చే ప్రొఫెసర్లను నియమించాలని అన్నారు. స్త్రీలపై అఘాయిత్యాలు జరగకుండా షార్ట్ ఫిలింలో అడ్వర్టైజ్మెంట్‌ల ద్వారా సంస్థల్లోనూ, కాలేజీల్లోనూ, బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించడం ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు.

30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలి

కొత్త పిఆర్‌సి కోసం కమిటీని నియమించి, పని సర్దుబాటులో లోపాలను సవరించాలి
ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ

ప్రజాశక్తి - భీమవరం

కొత్త పిఆర్‌సి అమలులోకి వచ్చేంతవరకు ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సాయివర్మ డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి వర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్‌టియు నిరంతరం పోరాడుతుందన్నారు. ఇటీవల కాలంలో పోరాటాల ఫలితంగా కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని చెప్పారు. కొత్త పిఆర్‌సి కోసం కమిటీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం నిలుపుదల చేసిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ, ఉద్యోగవిరమణ ప్రయోజనాలు, సంపాదిత సెలవుల నగదు చెల్లింపు వంటి పాత బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పని సర్దుబాటులో జరిగిన లోపాలను సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ

కౌలు రైతులకు పంట నష్టపరిహారమివ్వాలి

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

పంటనమోదు చేయించుకున్న భూస్వాముల పేరు వద్ద ఎడిట్ ఆప్షన్ ఇచ్చి కౌలురైతుల పేరు నమోదుచేసి పంటనష్టం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామశెట్టి రామాంజనేయులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతులను ఆదుకుంటామని ప్రచారం చేస్తున్నా ఆచరణలో పటిష్ట చర్యలు తీసుకోకపోవడంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. స్థానిక కలెక్టరేట్లో కౌలు రైతుల సమస్యలపై జిల్లా వ్యవసాయ అధికారికి వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురిసిన అధిక వర్షాలకు 16 మండలాల్లో దాదాపు 9 వేల ఎకరాల్లో 7 వేలమంది వరకు రైతులు పంట నష్టపోయారన్నారు. వీరిలో అధికంగా కౌలురైతులు ఉన్నారని, ఐతే ప్రభుత్వం పంట దెబ్బతిన్న కౌలురైతులను ఆదుకుంటామని చెబుతున్నా ఆచరణలో నలభై, యాభై శాతం పంట నమోదు భూయజమానుల పేరున చేయించుకున్నారన్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే పంటనష్టం కౌలురైతులకు అందే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం తక్షణం పంట దెబ్బతిన్న ప్రాంతంలో ఇక్రాఫ్ నమోదులో ఎడిట్ ఆప్షన్ ఇచ్చి కౌలురైతుల పేరున పంట నమోదు చేయాలని, పంటనష్టం, పంటల భీమా కౌలురైతులకు ఇచ్చేలా మండల, గ్రామ వ్యవసాయ అధికారులకు ఉత్తర్వులు జారీచేయాలని అన్నారు. భూయజమానులకు అవగాహన కలిగిస్తూ, కౌలురైతులకు భరోసా కల్పిస్తూ తక్షణం ప్రభుత్వ ఆదేశాలపై కరపత్రాలు ముద్రించి, ప్రచారం చేసి, కౌలురైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తక్షణం ఎడిట్ ఆప్షన్ ఇచ్చి భూయజమానులు పంటనమోదు చేయించుకున్న చోట కౌలురైతుల పేరు నమోదు చేస్తామన్నారు. కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేస్తామని, కౌలురైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

రత్నమాలకు బెస్ట్ సర్వీస్ అవార్డు

ఆచంట : భీమలాపురం గ్రామానికి చెందిన కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లుకు దుబాయ్‌లో బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నట్లు సోమవారం ఆమె విలేకరులకు తెలిపారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ దుబాయ్, అబుదాబి గ్లోబల్ కన్వెన్షన్ 2024 యుఎఇలోని గ్లోబల్ అధ్యక్షులు రామకృష్ణ, గూగుల్ చైర్మన్ టిజి వెంకటేష్ అధ్యక్షతన గ్లోబల్ అడ్వైజర్ అవార్డు కమిటీ చైర్మన్ టి.రాజశేఖర్, సురేష్, రామరామకృష్ణ, జయశ్రీ రాజశేఖర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు ఆమె తెలిపారు. కనకరత్నమాల 2003 నుంచి ఇప్పటివరకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలో అనేక పదవులు నిర్వహించి పలు అవార్డులు అందుకున్నట్లు తెలిపారు.

క్రీడా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - తణుకు

తణుకు నియోజకవర్గం స్కూల్ గేమ్స్ ఎంపికల్లో భాగంగా మొదటి రోజు అథ్లెటిక్స్, చెస్, బాడ్మింటన్ క్రీడల్లో పోటీలు నిర్వహించి నియోజకవర్గ జట్టును ఎంపికచేసినట్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ సంకు సూర్యనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలు నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరు కాగా వారిలో ప్రతిభ ఆధారంగా 60 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్టు తెలిపారు. వీరంతా తణుకు నియోజకవర్గం తరపున జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ పోటీలను వ్యాయమ ఉపాధ్యాయులు బి.జాన్సన్, టి.వినోద్, వై.సోమయాజులు, ఎం.నాగరాజ్యం, కె.సుబ్బారావు, ఎన్.అప్పారావు, జి.రవి, కె.శ్రీనివాస్, జి.తాతారావు, సంధ్యారాణి, వి.సుమలత, ఎస్.సతీష్‌బాబులు పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఉండి: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, దాని కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎల్‌సిఐఎఫ్ కోఆర్డినేటర్ ఆర్‌విఎస్.సూర్యనారాయణ రాజు అన్నారు. ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో పర్యావరణ పరిరక్షణ-మొక్కలు పెంపకం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వై.రామలక్ష్మి అధ్యక్షతన సభ నిర్వహించారు. రీజనల్ చైర్మన్ గొంట్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ చెట్ల వల్ల ఉపయోగాలు విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు, హెచ్‌ఎం రామలక్ష్మి, జోన్ చైర్మన్ రామరాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఉత్తమ సేవలకు గాను ప్రశంసా పత్రాన్ని రీజినల్ చైర్‌పర్సన్ అందించారు. కాగిత మహంకాళి, ముదునూరి విజయకృష్ణంరాజు పాల్గొన్నారు.

24 నుంచి సామూహిక ఎలుకల నిర్మూలన

వ్యవసాయ శాఖ అధికారిణి ఎ.జ్యోషిలా

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో వ్యవసాయ శాఖ ద్వారా అన్ని గ్రామాల్లోని పొలాల్లో సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం ఈనెల 24, 25వ తేదీల్లో రెండు రోజులు నిర్వహిస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎ.జ్యోషిలా తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులందరూ మొదటి రోజు అనగా 24వ తేదీన వారి పొలాల చుట్టూ గట్లపైన ఉన్న ఎలుక బొరియాలను గుర్తించి, మట్టితో కప్పి పెట్టాలని, రెండవ రోజు 25వ తేదీన ఎలుకల మందు బ్రోమోడై లిన్ 0.25 శాతం సిబి మందును ఉచితంగా పంపిణీ చేయబడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మొత్తం మండలానికి 14,960 ఎకరాలకు 61 కేజీల బ్రోమో డైలిన్ మందును ఉచితంగా సరఫరా చేయబడిందని, కావున మండలంలోని రైతులందరూ ఈ సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమానికి సహకరించాలని ఆమె కోరారు.

వ్యవసాయ శాఖ ద్వారా పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ప్రతివారం మంగళ, బుధవారాల్లో రెండు రోజులు వ్యవసాయ, అనుబంధ శాఖలతో క్షేత్ర సందర్శన, రైతులకు వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 24, 25వ తేదీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని, 24వ తేదీన ఉదయం ఆలమూరు, మధ్యాహ్నం వెలగలేరు గ్రామంలో, 25వ తేదీన ఉదయం పొలమూరు గ్రామంలోనూ, మధ్యాహ్నం మాముడూరు గ్రామంలోనూ నిర్వహించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

కొత్తపల్లిని కలిసిన మున్సిపల్ కమిషనర్

నరసాపురం : మాజీ మంత్రి, జనసేన నాయకుడు కొత్తపల్లి సుబ్బారాయుడుని ఆయన నివాసంలో నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సోమవారం కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ సుబ్బారాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకున్నారు. కమిషనర్ వెంట ఆర్ఐ నానాజీ, ఎఇ సునీల్ ఉన్నారు.


విరాళమందజేస్తున్న దాత

భవన నిర్మాణానికి విరాళం

కాళ్ల : కాళ్లకూరు గ్రామంలో స్వయంభూ శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయం ఆధ్వర్యంలో నిర్మించే అన్నదాన భవన నిర్మాణానికి భీమవరంకు చెందిన మేడిశెట్టి సాయి ప్రణీత్ రూ.50,116 విరాళం సోమవారం అందించారు. ఆలయ ఇఒ మోక అరుణ్ కుమార్ విరాళం అందించిన దాతలు మేడిశెట్టి సాయి ప్రణీత్‌లను సత్కరించారు.

'అభివృద్ధివైపు ఎపి'

ఆచంట : ఎపిని అభివృద్ధి వైపు నడిపిస్తుంది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని కోడేరు, వల్లూరు గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు పెచ్చెట్టి కనకదుర్గ, నేలపూడి పూడిబేబీ, రామ్మోహన్ రావు అధ్యక్షతన 100 రోజుల పాలన సందర్భంగా తెలిపారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, సీతారాంపురం నార్త్, కునపురెడ్డి మెరకకు చెందిన ఉంగరాల నాగరాజు, తండ్రి: నాగేశ్వరరావు అను నాకు సంబంధించిన **5311/2017, 5312/2017 నెంబరు** గల నా **దస్తావేజులతో** మా గ్రామం నుండి మొగల్తూరు వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలపగలరు.

ఉంగరాల నాగరాజు
తండ్రి: నాగేశ్వరరావు, సీతారాంపురం నార్త్,
కునపురెడ్డి వారి మెరక, పిన్: 534280.
సెల్: 9652822999, 9550203013